స్కెచ్

# ఎస్. జి. వో సంజీవయ్యా

"పూభా"

ఎక్కడైనా అప్పు పుడుతుందన్నా, అరువు దొరుకుతుందన్నా, వాయిదాలమీద తీర్చుకునే పద్ధతిపైని వస్తువులు—అందులోనూ ముఖ్య జీవితావసర వస్తువులు — యివ్వబడతాయన్నా అందరికన్నా ముందుగా ఎగిరి గెంతులేసుకుంటూ పరిగెత్తేవాడు ఎన్. జీ. వో. అందులో సంజీవయ్య సరేసరి.

కల్పవృక్షంవంటి ఆ వార్తను చూసేసరికి మేరువు పర్వతం యింట్లో పడినంత సంతోషంతో పొంగిపోయాడు సంజీవయ్య. తోవపోతూన్న ఒక ఆసామీని ఆపి, దినపత్రిక అడిగి తీసుకుని పేజీలు ఇటూ అటూ తిప్పేసరికి ఆ వార్త కనుపించింది. ఆ ఆసామీకి పత్రిక వెంటనే ఇచ్చేసి, ఎందుకైనా మంచిది తన దగ్గరకూడా ఆ పత్రిక ఉండటం మంచిది అనుకుని, న్యూస్ ఏజన్సీకి వెళ్ళి తనూ ఒక దినపత్రిక కొనుక్కున్నాడు ఏనాడూ పేపర్లు కొనని సంజీవయ్య. (సంజీవయ్యకి పేపర్లుకొనడం అలవాటు లేకపోవడం వార్తలంటే యిష్టంలేక కాదు పర్సుపెర్మిట్ చెయ్యక.) తను కొనుక్కున్న పేపర్లోకూడా మరోకసారి చూసుకొన్నాడు ఆ వార్తని.

"ప్రతి ఉద్యోగస్తునికీ, అతని జీతానికి సరిపైన విలువగల ఖద్దరు బట్టలు మూడు వాయిదాలపైని ఆ డబ్బును చెల్లించే పద్ధతిపైని ప్రభుత్వ ఖద్దరు విక్రయశాలల్లో యివ్వబడతాయి."

ఆ వార్త చూశాక బట్టలు యింట్లోకి వచ్చేసినట్టే సంతోషించాడు సంజీవయ్య. బట్టలకి చాలా అవసరంగాఉంది. అందులోనూ ముఖ్యంగా దుప్పట్లు కావాలి. రాత్రి పడుకున్నప్పుడు చలి గజగజలాడిస్తూంటే మంచి దుప్పటీ కొనుక్కుంటే బాగుణ్ణనుకునేవాడు. రెండు రోజులు క్రిందట బజారంతా తిరిగాడు కూడా దుప్పట్ల కోసరం. చాలా షాపులు తిరిగాడు, మంచి దుప్పట్లు అంటే చలికి బాగా ఆగేదుప్పట్లు చవకలో దొరుకుతాయేమోనని. కాని ఎక్కడా మంచి దుప్పట్లు చవకలో దొరకలేదు. ఈ షాపులన్నీ తిరగడంలో భారత ఖాదీ వస్త్రాలయంలో ఒక దుప్పటీ సంజీవయ్యకి బాగానచ్చింది. పొడుగుకి పొడవూ, వెడల్పుకి వెడల్పూ, చపాతీ అంత దళసరీ, జమిలి నేతా చాలాబాగుంది.

"ఎంతండీ యిది" అని అడిగాడు సంజీవయ్య

"రూపాయికి మూడణాలు తగ్గించగా ఏడు రూపాయిల ఒక అణాపైని ఏడుకాన్లు సేల్సుటాక్సు" అన్నాడు వస్త్రాలయం ఆసామీ.

"అంత ఖరీదే!"

"సముద్రమంత దుప్పటీ. చూసారా?"

"బాగానే ఉంది కాని ఒక్క దుప్పటీ ఏడు రూపాయిలంటే ఎంతకష్టం చూడండి. ఏ మూడో నాలుగో అయితే కొనుక్కోగలంగాని"

"మూడుకీ నాలుక్కీ వచ్చేదుప్పట్లు కూడా ఉన్నాయిలెండి. మా దగ్గరలేవుగాని"

"సరే వాటిమాట ఎందుకులెండి" అన్నాడు అలాటివి చూసి చూసి విసిగిపోయిన సంజీవయ్య.

"మీరు వెనకా ముందూ ఆలోచిస్తున్నారుగాని యిది ఒక దుప్పటీ తీసుకున్నారంటే కనీసం పదిసంవత్సరాల మన్నిక గ్యారంటీ. తక్కువడబ్బు పెట్టి అల్కారకాలు కొనుక్కుంటే ఏం లాభం చెప్పండి పట్టుమని పదేండ్లయినా మన్నదు."

"అది వాస్తవమేలెండి. కాని మా ఎన్. జీ. వోలతో ఒచ్చిన గొడవేమిటంటే ప్రతినెలా ఒకటో రెండూ పెట్టి చవకబారువస్తువు కొనుక్కోగలంగాని నాణ్యమైన వస్తువును ఒకసారి పది రూపాయిలు పెట్టి కొనుక్కోలేం"

"బాగా చెపుతున్నారే."

"మీరు అరువు ఇవ్వరు కామోసు"

"క్షమించాలి"

సంజీవయ్య ఇంటిముఖం పట్టాడు ఎప్పుడైనా కొనుక్కుంటే పోతే పోయిందిగాని అలాటి దుప్పటీయే కొనుక్కోవాలనుకుంటూ.

ఆ వార్త చూడగానే ఆ దుప్పటీ జ్ఞాపకం వచ్చింది సంజీవయ్యకి. గబగబా యింటికివెళ్ళి ఆ వార్తను శ్రీమతి చెవిలో వేశాడు.

"మనకి అరవైనాలుగు రూపాయిల బట్టలు యిస్తారు. నీకేం కావాలో కోరుకో" అన్నాడు గర్వంగా.

"మీ జీతం అరవైనాలుగా ఏమిటి? ప్రతినెలా తొంభైఅయిదు తెస్తున్నారే" అంది శ్రీమతి.

"అసలు జీతం అరవైనాలుగే. మిగతావన్నీ కరువుభత్యం వగైరాలు" అంటూ జీతానికీ బత్యానికీ, వార్తలో ఉన్న జీతం అన్న మాటకి ఉండే అంతరార్థాన్ని సూక్ష్మంగా విశదీకరించాడు తనకి తెలిసినంతమట్టుకి సర్వీసు రూల్సు నెమరువేస్తూ.

"ఖద్దరుబట్టలు మొయ్యటం కష్టం. ఏం కొనుక్కుందామన్నా" అంది శ్రీమతి.

"నాలుగు రోజులు కట్టుకుంటే అదే అలవాటవుతుంది. గాంధీ నెహ్రూకన్న గొప్పవాళ్ళమేంటి మనం. ఏదో మనకి సౌకర్యాలు కలిగించినందుకు గవర్నమెంటుకి ధన్యవాదాలు సమర్పించకుండా మొయ్యడం కష్టంట. నీకు ఇష్టంలేకపోతే మానీ నేనుపుచ్చుకుంటాను. ఆ తరువాత చీరలుకావాలి యివి కావాలీ అని పేజీ పెడితే లాభంలేదు"

పరిస్థితినిచూసి యీ తరుణం తప్పిపోతే చీర వచ్చేమార్గం దగ్గరలో లేదని గ్రహించిన శ్రీమతి "అయితే నాకూ రెండుచీరలూ, జాకెట్టు బట్టలు తీసుకురండి"అంది.

"రైట్. అలా తోవకిరా. నీకు రెండుచీరలూ, రెండు జాకెట్ గుడ్డలూ, నాకు పంచెలూ, రెండు చొక్కాలకి గుడ్డా, రెండు దుప్పట్లూ—యిప్పటికి చాల్లే. తరవాత సంగతి చూసుకుందాం. వీటికే దగ్గరదగ్గర అరవైరూపాయిలు పైని అవుతుంది. ఖద్దరు బట్టలు ఎంత మన్నికో అంత ఖరీదు."

మర్నాడు భారత ఖాదీ వస్త్రాలయంకు వెళ్లాడు సంజీవయ్య.

సంజీవయ్యని చూడగానే వస్త్రాలయం ఆసామీ "ఏమండీ మేష్టరుగారూ! దుప్పటీ యిమ్మన్నారా?" అన్నాడు.

"ఒక్కటేంటి ఖర్మం రెండు యివ్వండి" అన్నాడు చంకలో పేపరుతీసి చేత్తోపట్టుకుని.

రెండు దుప్పట్లనితీసి పెట్టాడు ఆ ఆసామీ.

"ఇంకా రెండుపంచెలూ, రెండుచీరలూ, రెండు చొక్కాలకిబట్టా, రెండు జాకెట్లుకి గుడ్డా యివెంతవుతాయో చెప్పండి కాస్త లెక్కవేసి. యింకా ఏవేనా అవకాశంవుంటే లిస్టులో చేరుస్తాం. ఒక నెలజీతం దాటకూడదన్నారు మీకు తెల్సునుగద"

"మధ్యని నాకు తెలియడ మేమిటి?"

"మీకు తెలియక పోవడమేమిటి మరీ చెపుతారు! ఇదుగో చూడండి" అంటూ పేపరులో వార్త చదివి వినిపించాడు సంజీవయ్య.

"ఓ యిదా! యిది మాకు వర్తించదు. అలాటి ఖద్దరు స్టోర్సు యీ వూరులోలేదు" అంటూ దుప్పట్లను యథాస్థానం చేర్చాడు కొట్టు ఆసామీ.

---

రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర శాసనసభకు జరిగే ఎన్నికలకుగాను ప్రభుత్వానికి సుమారు22 లేక 25 లక్షల రూపాయలు ఖర్చవుతుందనుకొంటున్నారు. ఎన్నికల కార్యక్రమానికిగాను సెక్రటరియేటులో అప్పుడే సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ఈసారి పోలింగు కేంద్రాలు ఎక్కువకావచ్చు. కనుక విరివిగా ఏర్పాట్లు చేయడం అవసరమవుతుంది. దీనికితోడు పోటీచేసే అభ్యర్థులసంఖ్య ఎక్కువయితే (బాలెట్ బాక్సస్) వోట్లపెట్టెలనుకూడా ఎక్కువచేయడ మవసరమవుతుంది.